ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 23 | బుధవారం 24, సెప్టెంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



## ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా

# మేడారం ఆలయం

- రాతి కట్టడాలతోనే నిర్మాణం ఉండాలి
- మేడారం జాతరకు జాతీయ స్థాయి గుర్తింపు ఇవ్వాలి
- అవసరమైన నిధులు మంజూరు చేయాలి
- మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనులు చేయాలి
- వందరోజుల్లో వర్క్ పూర్తి చేయాలి
- సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం
- మేడారం ఆలయ అభివృద్ధిపై సమీక్షలో సీఎం
- పరిసరాలను పరిశీలించిన రేవంత్ రెడ్డి
- సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న ముఖ్యమంత్రి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ములుగు జిల్లా మేడారం మహాజాతరలో సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీల అభివృద్ధి, సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రగతి అంశాలపై కీలక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఒక బాధ్యత మాత్రమే కాకుండా, భావోద్వేగంతో కూడిన బాధ్యత అని అన్నారు. ఆనాటి పాలకులు ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారని విమర్శించారు. "సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతోనే నేను పాదయాత్ర మొదలుపెట్టా. 2023 ఫిబ్రవరి 6న ఈ గడ్డపై నుంచే తెలంగాణకు పట్టిన చీడ, పీడలను వదిలించేందుకు అడుగులు వేశాం" అని గుర్తుచేసుకున్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. "సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు

..మిగతా 2లో

## జాతీయ చలనచిత్ర అవార్డుల్లో

# తెలుగు సినిమా సత్తా

- ఢిల్లీలో 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానం
- ఉత్తమ చిత్రంగా విధు వినోద్ చోప్రా '12th ఫెయిల్'
- ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాస్సే
- 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రానికి రాణీ ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు
- తెలుగులో బేబి, బలగం, హనుమాన్ చిత్రాలకు పురస్కారాలు
- 'బేబి' చిత్రంలోని పాటకు ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్

02





## కాలిఫోర్నియాలో

# తాల్ హాస్పిటల్స్ ఫెస్ట్

- కేటీఆర్‌ను కలిసి స్వయంగా ఆహ్వానించిన సీఈవో శ్రీసాయి
- అక్టోబర్ 24న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో హెల్త్ ఫెస్ట్
- కీలకోపన్యాసం చేయనున్న కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్‌కు 'తాల్ హాస్పిటల్స్ ఫెస్ట్ 2025'కు ఆహ్వానం లభించింది. అమెరికాలో జరగనున్న ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయనకు ఆహ్వానం అందింది. ఈ మేరకు తాల్ హాస్పిటల్స్ సీఈవో

..మిగతా 2లో

# వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్



- కేంద్ర ఉద్యోగులు, పింఛనర్లు, ప్రజలకు లాభం
- ప్రాథమిక ఓపీడీ చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా..
- ట్వీట్ ద్వారా వివరాలు ప్రకటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (CGHS) వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా

..మిగతా 2లో



# కృష్ణా జలాల్లో రాజీపడం

- ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వం
- 555 టీఎంసీల నీరు కావాలని డిమాండ్
- కర్ణాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కృష్ణా జలాల వివాదంపై ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం తమ వాదనలను వినిపిస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తమ వాదనల వివరాలను వెల్లడించారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్

..మిగతా 2లో

# స్థానిక ఎన్నికలపై సుప్రీం స్టే

- ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై స్టే
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సుప్రీంకోర్టు
- గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ హైకోర్టు ప్రకటించడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన గిరిజనేతరులు



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించగా, ఆయా గ్రామాల గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కనపెట్టి నిజాం ఇచ్చిన


..మిగతా 2లో

# ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది
- పల్లెల్లో గులాబీల జెండాను ఎగురవేయాలి
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను గడపగడపకూ వివరించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

02





02

## కాళేశ్వరం కమిషన్

# రిపోర్ట్‌లో ట్విస్ట్

- హైకోర్టులో స్మితా సబర్వాల్ పిటిషన్
- పీసీ ఘోష్ రిపోర్ట్‌లో ప్రస్తావన
- స్పెషల్ సెక్రటరీగా కీలకపాత్ర
- నోటీసులివ్వలేదని స్మితా వాదన



## నల్గొండ

# లిల్లీపుట్‌ను ఓడిస్తాం

- బీఆర్ఎస్ నాలుగు ముక్కలు అయింది
- నల్గొండలో ఈసారి గెలుపు మాదే
- గ్రామీణ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

02

## కాలిఫోర్నియాలో 'తాల్ హాస్పిటల్స్ ఫెస్ట్'

మొదటిపేజీ తరువాయి



శ్రీ సాయి గుండవెల్లి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను కలిసి స్వయంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో ఈ హెల్త్ ఫెస్ట్ 2025ను నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకువచ్చే వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్ కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కేటీఆర్ కీలక ఉపన్యాసం చేయనున్నారు.



## ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా మేడారం ఆలయం

మొదటిపేజీ తరువాయి

చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. రాతి కట్టడాలు ఎప్పటికీ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయని పేర్కొంటూ, ఆలయ నిర్మాణంలో రాతి కట్టడాలకే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అదే సమయంలో, కేంద్రంపై విరుచుకుపడిన సీఎం రేవంత్ రెడ్డి, "కుంభమేళాకు వేలకోట్లు ఇస్తున్న కేంద్రం, ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. మహాజాతర సమయంలో తిరిగి వచ్చి, ఈ జాతరను మరింత ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు.

## వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక OPD చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" దార్శనికతకు సాక్ష్యంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.

## స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే

మొదటిపేజీ తరువాయి

ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల పైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## కృష్ణా జలాల్లో రాజీపడం

మొదటిపేజీ తరువాయి

ఎత్తును పెంచే అంశాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఏ ప్రభుత్వం ఉన్నా తమ రాష్ట్ర వాటా విషయంలో రాజీ పడేది లేదని.. కృష్ణా, గోదావరి జలాల్లో తమ వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ మూడు రోజుల పాటు వాదనలు వినిపిస్తున్నారు. కృష్ణా నది ప్రవాహం, క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకు 70 శాతం నీటి వాటా కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 టీఎంసీల నీటిని కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో తాము ఏకీభవించడం లేదని, అందుకే ఫైల్ రీఓపెన్ చేసి మొదటి నుంచి వాదనలను వినిపిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అండర్ సెక్షన్ 3 రిఫరెన్స్ పై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, ఫిబ్రవరి నుంచి వాదనలు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం తుది వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. ఈ వాదనలపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇప్పటికే బ్రీఫింగ్ జరిగిందని, తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం పూర్తిస్థాయిలో పోరాడుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తెలుగు సినిమా సత్తా

- ఢిల్లీలో 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానం
- ఉత్తమ చిత్రంగా విధు వినోద్ చోప్రా '12th ఫెయిల్'
- ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాస్సే
- 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రానికి రాణీ ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు
- తెలుగులో బేబి, బలగం, హనుమాన్ చిత్రాలకు పురస్కారాలు 'బేబి' చిత్రంలోని పాటకు ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్

నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :



భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలో వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజేతలు అవార్డులను అందుకున్నారు. ఈ ఏడాది జాతీయ వేదికపై తెలుగు సినిమా తన సత్తాను చాటింది. 'బేబి', 'బలగం', 'హనుమాన్' వంటి చిత్రాలు పలు కీలక విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలిచాయి. విధు వినోద్ చోప్రా నిర్మించి, దర్శకత్వం వహించిన '12th ఫెయిల్' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో అద్భుతమైన నటన కనబరిచినందుకు విక్రాంత్ మాస్సే, 'జవాన్' చిత్రానికి గాను షారుఖ్ ఖాన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్న రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు.

### తెలుగు సినిమాకు దక్కిన గౌరవం

ఈసారి తెలుగు సినిమా పలు విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. 'బేబి' చిత్రంలోని 'ప్రేమిస్తున్నా' పాటకు గాను పీవీఎన్ఎస్ రోహిత్ ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఎంపికయ్యారు. ఇదే చిత్రానికి సాయి రాజేష్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు గెలుచుకున్నారు. 'బలగం' సినిమాలోని 'ఊరు పల్లెటూరు' పాటకు కాసర్ల శ్యామ్ ఉత్తమ గీత రచయితగా జాతీయ పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. ఇక 'హనుమాన్' చిత్రానికి గాను జెట్టి వెంకట్ కుమార్ ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పురస్కారం అందుకున్నారు. 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి సుకృతి వేణి బండ్రెడ్డి ఉత్తమ బాలనటిగా ఎంపికయ్యారు.

### 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల పూర్తి జాబితా

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12th ఫెయిల్ (విధు వినోద్ చోప్రా)
ఉత్తమ నటుడు: షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాస్సే (12th ఫెయిల్)
ఉత్తమ నటి: రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)
ఉత్తమ వినోదాన్ని అందించిన ప్రజాదరణ పొందిన చిత్రం: రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ (కరణ్ జోహార్)
ఉత్తమ దర్శకత్వం: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)
ఉత్తమ సహాయ నటుడు: విజయరాఘవన్ (పూక్కాలం), ఎం.ఎస్. భాస్కర్ (పార్కింగ్)
ఉత్తమ సహాయ నటి: ఊర్వశి (ఉల్లొళుక్కు), జానకి బోడివాలా (వశ్)
ఉత్తమ నూతన దర్శకుడు: ఆశిష్ అవినాష్ బెండే (ఆత్మపాంప్లెట్)
ఉత్తమ బాలల చిత్రం: నాల్ 2
ఉత్తమ బాలనటులు: సుకృతి వేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు), కబీర్ ఖందారే (జిప్సీ), త్రీషా థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగతాప్ (నాల్ 2)
జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలతో కూడిన ఉత్తమ చిత్రం: సామ్ బహదూర్
ఉత్తమ నేపథ్య గాయకుడు: పీవీఎన్ఎస్ రోహిత్ (బేబి ప్రేమిస్తున్నా)
ఉత్తమ నేపథ్య గాయని: శిల్పా రావు (జవాన్ చలేయా)
ఉత్తమ గీత రచయిత: కాసర్ల శ్యామ్ (బలగం ఊరు పల్లెటూరు)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ (AVGC): జెట్టి వెంకట్ కుమార్ (హనుమాన్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): సాయి రాజేష్ (బేబి), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్)
ఉత్తమ సంభాషణలు: దీపక్ కింగ్రానీ (సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ప్రసంతను మహాపాత్ర (ది కేరళ స్టోరీ)
ఉత్తమ సౌండ్ డిజైన్: సచిన్ సుధాకరన్, హరిహరన్ మురళీధరన్ (యానిమల్)
ఉత్తమ ఎడిటింగ్: మిథున్ మురళి (పూక్కాలం)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: మోహన్‌దాస్ (2018)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: సచిన్ లోవలేకర్, దివ్య గంభీర్, నిధి గంభీర్ (సామ్ బహదూర్)
ఉత్తమ మేకప్: శ్రీకాంత్ దేశాయ్ (సామ్ బహదూర్)
ఉత్తమ కొరియోగ్రఫీ: వైభవి మర్చంట్ (రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ ఢిండోరా బాజే రే)
ఉత్తమ డాక్యుమెంటరీ: గాడ్ వల్చర్ అండ్ హ్యూమన్ (రిషిరాజ్ అగర్వాల్)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్: గిధ్ (ది స్కావెంజర్) (మనీష్ సైనీ)
ఉత్తమ సినీ విమర్శకుడు: ఉత్పల్ దత్తా

# నల్గొండ లిల్లీపుట్‌ను ఓడిస్తాం

- బీఆర్ఎస్ నాలుగు ముక్కలు అయింది
- నల్గొండలో ఈసారి గెలుపు మాదే
- గ్రామీణ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :



బీఆర్ఎస్ పార్టీ రాజకీయ భవిష్యత్తుపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే నాలుగు ముక్కలైందని, అది మునిగిపోయిన పడవ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో నల్గొండ 'లిల్లీపుట్'ను కూడా ఓడించి తీరుతామని అన్నారు. నల్గొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ పని పూర్తిగా అయిపోయిందని, దాని గురించి ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరని అన్నారు. ఈ సందర్భంగా నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన పలు హామీలు ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరిస్తామని కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. నల్గొండ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఆయన అన్నారు.

# కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో ట్విస్ట్..

- హైకోర్టులో స్మితా సబర్వాల్ పిటిషన్
- పీసీ ఘోష్ రిపోర్ట్‌లో ప్రస్తావన
- స్పెషల్ సెక్రటరీగా కీలకపాత్ర
- నోటీసులివ్వలేదని స్మితా వాదన

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణ హైకోర్టులో సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టులో తన పేరును తొలగించాలని ఆమె కోర్టును ఆశ్రయించారు. కమిషన్ రిపోర్ట్‌లో స్మితా సబర్వాల్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలపై రివ్యూ చేసినట్లు పేర్కొంది. ఆమె మూడు బ్యారేజీలను స్వయంగా సందర్శించిందని, ఆ సందర్శనల ఫోటోలు కూడా రిపోర్ట్‌లో పొందుపరిచింది. అదనంగా, పలు జిల్లాల నుంచి వచ్చిన ఫీడ్బ్యాక్‌ను అప్పటి ముఖ్యమంత్రికి స్మితా సబర్వాల్ చేరవేసిందని కమిషన్ రిపోర్ట్‌లో పేర్కొంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రటరీ హోదాలో ఉన్న సమయంలో, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు జారీ చేయడంలో స్మితా సబర్వాల్ కీలకపాత్ర పోషించారని కమిషన్ గుర్తించింది. నిజనిజాలను క్యాబినెట్ ముందు పెట్టనందుకు ఆమెపై చర్యలు తీసుకోవాలని రిపోర్ట్‌లో సూచించింది. అయితే, పీసీ ఘోష్ కమిషన్ తనకు వివరణ ఇవ్వడానికి 8B, 8C నోటీసులు ఇవ్వలేదని స్మితా సబర్వాల్ హైకోర్టులో పేర్కొన్నారు. ఆ అవకాశాన్ని ఇవ్వకుండానే తన పేరు రిపోర్ట్‌లో చేర్చడం అన్యాయం అని వాదించారు. దీంతో, కమిషన్ రిపోర్టును క్వాష్ చేయాలని పిటిషన్‌లో కోరారు.

# ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది
- పల్లెల్లో గులాబీల జెండాను ఎగురవేయాలి
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను గడపగడపకూ వివరించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :



స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో ప్రజలకు వివరించాలని సూచించారు.

# బీజేపీ లో చేరిన నటుడు వరుణ్ సందేశ్ తల్లి రమణి

- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :

హ్యాపీడేస్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటుడు వరుణ్ సందేశ్ తల్లి డాక్టర్ రమణి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆమె తాజాగా భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రావు ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణి మాట్లాడుతూ.. సమాజసేవ చేయడం అంటే తనకు చాలా ఇష్టమని అన్నారు. హిందుత్వం అంటే తమ కుటుంబానికి ఇష్టమని.. అందుకే బిజెపిలో చేరినట్లు వివరించారు. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు







# 'స్వచ్ఛ భారత్'లో బీజేపీ శ్రేణులు



**మెదక్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75 జన్మ దిన సందర్భంగా సేవ పక్షం 15 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణం ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ దేశం, రాష్ట్ర, పట్టణాలు, గ్రామాలు బాగుండాలంటే పరిశుభ్రత అనేది చాలా ముఖ్యం అన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా రాష్ట్ర పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను అన్నింటిని కూడా దిగ్విజయంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, మండల అధ్యక్షురాలు బెండ వీణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు గుండు మల్లేశం, ఆకుల ప్రభాకర్, శ్యామ్, బక్కవారి శివ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీటి సదుపాయం కల్పించాలి

## అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే బేబీనాయన



**మన్యం జిల్లా, సెప్టెంబర్ 23 (ప్రజాస్వరం) :** బొబ్బిలి నియోజకవర్గంలో బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలలో కొంతమంది రైతాంగం కేవలం వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, వెసులుబాటు ఉన్నచోట చెక్ డ్యామ్ లు నిర్మించి, తద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) కోరారు. అలాగే, నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రతి ఎమ్మెల్యేకి కొంత నిధులు కేటాయిస్తే, కొన్ని సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందని తెలుపగా, అందుకు స్పందించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎమ్మెల్యే బేబీనాయన గారుని మంచి ప్రశ్న అడిగారని అభినందిస్తూఈ విషయాన్ని గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ విషయమై ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే, తాను కూడా సంతోషిస్తాని అన్నారు.




# ఆయుర్వేదంతో ఆరోగ్యానికి మేలు

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ

**పెద్దపల్లి,సెప్టెంబర్23(ప్రజా స్వరం):** ఆయుర్వేదం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ అన్నారు.మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎం.బి గార్డెన్ లో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ,ఆయుష్ జిల్లా ఇంచార్జి డాక్టర్ జి.ఎన్. అరుణ్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ ఆయుర్వేద మెగా వైద్య శిబిరం ద్వారా దాదాపు 470 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.వైద్య శిబిరం నందు కీళ్ల నొప్పులు దగ్గు జలుబు మలబద్ధకం ఆసిడిటీ,బిపి కిడ్నీలో రాళ్లు వాత రోగులు జ్వరాలు ఆస్తమా దీర్ఘకాలిక వ్యాధులను చూడడం జరిగిందని అన్నారు. ఆయుర్వేద ప్రాముఖ్యత,వివిధ రకాల మొక్కలు మూలికల గురించి వివరిస్తూ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని,శరీరం పైన ఎలాంటి దుష్ప్రభావం చూపదని,ఆయుర్వేద వైద్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్ విద్యాసాగర్,వైద్యులు మహేష్,అమర్నాథ్,ప్రభాకర్,దివ్య,నిహారిక,మారుతి,శిరీష ఫార్మాసిస్టులు ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలి

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన స్థానికులు

**శామీర్‌పేట, సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :** మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని క్రీడా ప్రాంగణంను కాపాడాలని ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. క్రీడా ప్రాంగణంకు సంబంధించిన కోర్టు కేసు స్టే వేకెట్ చేపించి గ్రామ మహిళలకు బతుకమ్మ లు ఆడుటకు, యువకులు క్రీడలు ఆడుకోవడానికి అందుబాటులోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్, మూడుచింతలపల్లి ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు భూపాల్ రెడ్డి, తోకల అనిల్ రెడ్డి, తోకల ధర్మ రెడ్డి, చందుపట్ల రాజిరెడ్డి, జింకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



**మన్యం జిల్లా, సెప్టెంబర్ 23 (ప్రజాస్వరం) :** విజయవాడలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుసమక్షంలో, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గం, గరుగుబిల్లి వైసీపీ ఎంపీపీ ఉరిటి రామారావు తో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాస్ కురుపాం ఎంఎల్ఏ తోయకజగదీశ్వరిఅందరికీ పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి ని వీడి టిడిపిలో చేరిన వారిలో గరుగుబిల్లి మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు తో పాటు ఎంపీటీసీ సభ్యులు చింతల రూపవతి, కొత్తూరు ఎంపీటీసీ సభ్యులు గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ, రావుపల్లి ఎంపీటీసీ సభ్యులు యందవ సదానందం, మరుపెంట సర్పంచ్ ఉరిటి నిర్మల, రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, బురదవెంకటాపురం సర్పంచ్ బొత్స లక్ష్మి, పెదగుడబ సర్పంచ్ జాగాన సరస్వతి, కొత్తపల్లి సర్పంచ్ గొట్టాపు శ్రీవేణి, దళాయివలస సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ, రాయిందొరవలస సర్పంచ్ బేత వెంకటనాయుడు, వైసిపి నాయకులు గొట్టాపు తేజేశ్వరరావు, మూడడ్ల అప్పారావు, బోను చంద్రశేఖర రావు, చింతల మల్లినాయుడు, గుంట్రెడ్డి శంకర్రావు, నల్ల రవికుమార్, జాగాన మురళి, మువ్వల సింహాచలంనాయుడు, అల్లు లక్ష్మీనారాయణ పెదిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, గుంట్రెడ్డి శంకర్రావు, బోను సురేష్, బాణాల సురేష్, పప్పల సత్యనారాయణ, తేంటు శ్రీరాములు నాయుడు, బొత్స శ్రీరాములు, నల్ల శ్రీరాములు నాయుడు, సింగిరెడ్డి ఈశ్వరరావు, ముదిలి వెంకటరమణ, జాగాన తిరుపతి రావు, చుక్క సత్యనారాయణ, బానాల శ్రీరాములు, గొట్ట గౌరునాయుడు, దాసరి ఆది నారాయణ, బొంగు కోటేశ్వరరావు, బోను తిరుపతిరావు, పెద్దింటి గౌరునాయుడు, బోను చంద్రినాయుడు, అల్లు అప్పలనాయుడు, పల్లా హేమసుందరరావు, పెద్దింటి సత్యనారాయణ, బెల్లాన సంఘం నాయుడు, జి శ్రీరాములు నాయుడు, అల్లు కృష్ణమూర్తి నాయుడు, బడె త్రినాధ్, గుల్లిపల్లి కైలాష్, గొల్లు కృష్ణ, కోట చిన్నంనాయుడు, గుల్లిపల్లి శ్రీను, సత్యనారాయణ, బెల్లాన రాము, పట్టా లక్ష్మణ్ రావు, అక్కేన సింహాచలం నాయుడు, సీర సింహాచలం, చింతల ఉమమహేశ్వరావు, దాసరి పార్థసారధి తదితరులు వైసీపీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు, కురుపాం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారు ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులు సమిష్టిగా కలిసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, దత్తి లక్ష్మణ రావు మాత్రాపు పురుషోత్తం నాయుడు, అక్కెన మధుసూదన్ రావు, అంబటి రాంబాబు, ముదిలి బాబు విజయవాంకుశం, కోట సుమన్, వెంకటనాయుడు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

**శామీర్ పేట, సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :**

చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలి. ఆట పాటలతో చదువు నేర్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. పోషన్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్ పేట మండంలలోని ఆలియాబాద్ అంగన్ వాడీ సెంటర్ ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ వారి ఆట పాటలను చూస్తూ సంతోషం వ్యక్తం చేసారు. వంట సామాగ్రిని పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, అంగన్ వాడీ టీచర్ చిన్నారులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశం అక్రమ నిర్మాణం నేలమట్టం

## మంథనిలో పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేత



**మంథని/ పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో అక్రమంగా నిర్మించిన రెండు అంతస్తుల నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు.పోలీసు బందోబస్తు నడుమ రెండు జేసీబీలతో కూల్చివేశారు.ఆ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారు హైకోర్టును ఆశ్రయించాడు.దీంతో దాదాపు రెండేళ్ల తర్వాత కోర్టు తీర్పు రావడంతో మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.కాగా మంథని పట్టణంలో అక్రమ నిర్మాణలను కూల్చివేయాలని కోర్టు లో ఇదివరకే పలు పిటిషన్లు దాఖలయ్యాయి. న్యాయస్థాం ఆదేశాలు వచ్చిన వెంటనే వాటిని కూడా కుల్చివేస్తామని అధికారులు చెబుతున్నారు.

# అక్టోబర్ 6 లోపు మైనార్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా దరఖాస్తులు సమర్పించాలి

## పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**

అక్టోబర్ 6 లోపు మైనార్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పేద మైనారిటీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కొరకు ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన,రేవంతన్న కా సహారా అనే పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది.ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజన పథకం కింద పేద మైనారిటీ (ముస్లిం, సిక్,బుద్ధిష్టు,జైన్స్,పార్సి) లకు 50 వేల రూపాయలు,రేవంతన్న కా సహారా యోజన పథకం కింద ఫకీర్,దూదెకులు,పేద ముస్లిం అభివృద్ధికై మోపెడ్ లు,బైకులు,ఈబైక్ లో కొరకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నారని తెలిపారు.జిల్లాలోని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు https://tgobmms.cgg.gov.in ద్వారా అక్టోబర్ 6 లోపు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు,రేషన్ కార్డు చిరునామా రుజువుగా తప్పనిసరిగా జత పరచాలని అన్నారు.దరఖాస్తుదారుడి వయో పరిమితి 21 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని,ఒక సంవత్సరం లో ఒకరికి మాత్రమే ఆర్థిక సహాయం ఇవ్వబడుతుందని,గత 5 సంవత్సరాల నుంచి టి.జి.ఎం.ఎఫ్.సి నుంచి ఆర్థిక సహాయం తీసుకున్నవారు అర్హులు కాదని అన్నారు.ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజన పథకం కింద దరఖాస్తు చేసుకునే మహిళ అభ్యర్థులు తప్పనిసరిగా 5వ తరగతి ఉత్తీర్ణత ఆపై చదివి ఉన్నవారు అర్హులని,జిల్లాలోని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, సెప్టెంబర్ 23(ప్రజా స్వరం):**

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్, యాలాల్, తాండూరు, పెద్దేముల్, కోట్పల్లి మండలాలకు, తాండూరు పట్టణానికి చెందిన 157 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 60,00,000/ (అరవై లక్షల) విలువ గల చెక్కులను తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో స్థానిక నాయకులతో కలిసి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.

# భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరిచిన న్యాయవాదుల లైసెన్స్ రద్దు చేయాలి



- **ఎస్సి, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్**
- **నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం**
- **తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం) :**

తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహ రెడ్డికి సిద్ధిపేట బార్ అసోసియేషన్ అడ్వకేట్స్ మరియు ఎస్సి, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ న్యాయవాదులు మరియు హైకోర్టు అడ్వకేట్స్ కలిసి భారత ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన సిద్ధిపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు పొద్దుటూరి శ్రీకాంత్ వైశ్య, ఎం. మురళి మోహన్ రావు బ్రాహ్మణ న్యాయవాదులపై పిర్యాదు చేశారు. సదరు న్యాయవాదులు కనకము సింహాసనమున, వెనుకటి ఊరి శూనకాలు మలము తినేవి, వెనకటి శూనకాలు మళ్ళీ వస్తాయి అనుకోలేదు, ప్రస్తుతానికి ఢిల్లీలో ఒకటి లభ్యమైనదని, రెండేళ్ళకోసం మొన్ననే ఓ శూనకాన్ని కుర్చీలో కూర్చుండబెట్టారు, అతి తెలివి మాటలు మాట్లాడం దాని అలవాటు అని అసభ్య పదజాలంతో భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరుస్తూ దూషించారని, కుల మతోన్మాదముతో అడిగిన న్యాయవాదులపై అహంకారపూరీత దొరనితో అనుసరించారని తెలిపారు. సిద్ధిపేట పోలీస్ స్టేషన్ నందు వారిపై కేసు నమోదయ్యిందని, వారి యొక్క ఎన్రోల్మెంట్ సర్టిఫికెట్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. హైకోర్టు నందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు ను, అడిషినల్ అడ్వకేట్ జనరల్ తెరా రజినీకాంత్ ను కలిసి విజప్తి చేశారు. ఇట్టి పిర్యాదుపై బార్ కౌన్సిల్ చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్ట్ అడ్వకేట్స్ కొమ్ము ప్రవీణ్ కుమార్, పోలె విష్ణు, చందులాపురం భూపతి, సిద్ధిపేట న్యాయవాదులు ఎ. బాపురావు, కర్రోళ్ల రవిబాబు,యాదగిరి, పల్లెటూరి ప్రసాద్, బత్తుల రాజు, పత్రి ప్రకాశ్, పర్వతం రాములు, జేరిపోతుల యాదగిరి, బైరి ప్రవీణ్, రాగుల బాబు, ఎర్ర సాగర్,బాల్ రాజ్, అశోక్, శంకర్, ఎల్లం, ప్రవీణ్, పుణేందర్, యెలా బాలరాజు, శ్రీనివాస్, దుబ్బ రాజశేఖర్, శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



# మెగా ఆరోగ్య శిబిరం ప్రారంభం







**తాండూరు, సెప్టెంబర్ 23(ప్రజా స్వరం):**

**తాండూరు పట్టణంలోని మతాశిశు ఆస్పత్రిలో మంగళ వారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరం (స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్) ను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంబించారు. తాండూరు నియోజకవర్గం లోని తాండూరు పట్టణం, తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల ప్రజలు శిభిరం లో పాల్గొన్నారు.**

# పత్తి పంట కొనుగోలుకు ఏర్పాట్లు చేపట్టాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**

**వికారాబాద్, సెప్టెంబర్ 23(ప్రజా స్వరం):**



రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండ రైతులు పండించిన పత్తి పంట ను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరెట్ సమావేశం హాలు నందు పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశం లో అయన మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో బాగంగా అన్ని రకాల ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా లో సుమారుగా 2లక్షల 46 వేల 725 ఎకారాలలో పత్తి సాగు ఐనదని, 2 లక్షల 68 వేల 282 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 202526 సం, సీజన్ పత్తి కొనుగోలు ప్రారంభం కానున్న దృష్ట్యా జిన్నింగ్ మిల్లులు వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలనీ ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రమానికమని, రైతులందరు తమ బ్యాంకు అకౌంట్ ఖాతా లను ఆధార్ తో అనుసంధానం చేసికునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్ లైన్ లో ఫీడు కాని రైతుల లిస్టు కు ఏ ఇ ఓ సర్టిపై చేస్తే ఆన్ లైన్ దృవీకరణ ఇవ్వాల్సి ఉంటుందని, నకిలీ దృవీకరణ సర్టిఫికేట్ లు జారి చేస్తే కట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం గ్రేడ్ వన్ కు మద్దత్తు దర రూ 8110 /లు ,గ్రేడ్ 2 రకానికి రూ 7710 / ప్రతి క్వింటాలు కు మద్దత్తు దర నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి పత్తి మిల్లు వద్ద ముందస్తు గా తూకం యంత్రాల పని తీరును పరిశీలించుకోవాలని, తూనికలు కొలతల శాఖ అధికారులకు ఆదేశించారు. అగ్ని ప్రమాధాలు సంభావించకుండ ఫైర్ శాఖ ఏర్పాట్లు చేయాలనీ సూచించారు. పోలీస్, రవాణా అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా జిన్నింగు మిల్లుల వద్ద తగు ఏర్పాట్లు చేయాలనీ, పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. పత్తి కొనుగోలుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 14 జిన్నింగ్ మిల్లుల నుండి, సి.సి.ఐ. ద్వారా ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు.అన్ని శాఖ ల అధికారులు రైతుల కోసం పని చేయాలన్నారు. సమావేశం లో అడిషనల్ ఎస్ పి



రాము నాయక్, అసిస్టెంట్ మేనేజర్ సి సి ఐ ప్రజక్త , మార్కెటింగ్ అధికారి సారంగపాని, వ్యవసాయ అధికారి రాజా రత్నం ,మార్కెట్ కమిటి చైర్మెన్లు, కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు విద్యుత్, రవాణా, పోలీస్, అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు

**కొడంగల్, సెప్టెంబర్ 23(ప్రజా స్వరం) :**
కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. మంగళ వారం కొత్తపల్లి మండలం లో కొత్తపల్లి వాసులు కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి సమక్షంలో 20 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వాళ్లకు గుర్తింపు ఉంటుందని అన్నారు.. వచ్చేనెల స్థానిక సంస్థ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.

**బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారు..**
కిషన్ నగర్ కు చెందిన రెబన్ పల్లి ఆంజనేయులు , జంబుల ఆంజనేయులు, గొల్ల గడ్డ సాయిలు , గొర్లోను బాయ్, సి మైపాల్ ,సి కృష్ణ ,దుప్పటి కట్టు తాండ గోరే నాయక్ ,తిమ్మారెడ్డి పల్లెకు చెందిన మహేందర్,మహేష్ లు కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల పరిశోధన సజావుగా చేయాలి

## జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 23(ప్రజా స్వరం) :**
వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి జిల్లా పోలీస్ అధికారులందరితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం జిల్లా ఎస్పి మాట్లాడుతూ ముఖ్యంగా లాంగ్ పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని, అట్టి కేసులను డిఎస్పి మరియు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు దృష్టి సారించాలని, నేర నియంత్రణ లో మరియు నేర పరిశోదనలో సిసి కెమెరాల ప్రాధాన్యత చాలా వరకు ఉంటుంది,కాబట్టి ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజలకు అవగాహనా కల్పించి సిసి కెమెరాల ఏర్పాటు చేయాలనీ చెప్పారు. పోక్సో కేసులలో ఇన్వెస్ట్ గేషన్వెంటనే పూర్తి చేసి చార్జ్ షీట్ వేయాలి అని సూచించారు. ఇతర రాష్ట్రాల ల నుండి వచ్చే వ్యక్తులకు రూమ్ లు అద్దెకు ఇచ్చే ముందు ఇంటి యజమానులు వారి చిరునామా . ఫోన్ నంబర్స్ మొదలయిన వాటి తో నిర్ధారించుకోవాలి అని తెలిపారు.ఎన్‌బిడబల్యూ లు పెండింగ్ లేకుండా చూడాలని తెలిపినారు. న్సెలింగ్ లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పి గారు తెలిపినారు.పోలీస్ స్టేషన్ లలో నమోదైన గ్రేవ్ కేసులలో నిందితులకు తప్పని సరిగా శిక్ష పడే విధంగా పోలీస్ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు.

**పోలీస్ అధికారులకు శిక్షణ**
జిల్లాలో నమోదైన కేసులలో శిక్ష పడే శాతన్ని పెంపొదించుటకు, క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేయుటకు మంగళ వారం పి .రాములు పిపి (రిటైర్డ్) జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఓ లకు, కోర్ట్ డ్యూటి ఆఫీసర్ లకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ లో పోలీస్ అధికారులకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసే విధానం పైన, అలాగే కేసులలో కన్విక్షన్ శాతన్ని పెంచుటకు చేయాల్సిన విషయాలపైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.రాములు నాయక్, తాండూర్, పరిగి, వికారాబాద్ డిఎస్పి ,జిల్లా ఇన్స్పెక్టర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అధికారులు, జిల్లా ఎస్ఐ అధికారులు,ఆర్ఐ లు,ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.





# కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

**శామీర్‌పేట, సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :** బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక". బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యంత్రాంగం తరపున మంగళవారం జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక శాఖలతోపాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హౌజ్ కీపింగ్ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక, కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# పండక్కి ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త

- **జినోమ్ వ్యాలీ (తుర్కపల్లి)పోలీస్ స్టేషన్ సిఐ గోపగాని గురువయ్య**


**శామీర్ పేట సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :**
దసరాకు ఊరెళ్ళుతున్న ప్రజలకు తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ సిఐ గురవయ్య పలువురికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు ముందుకు రావాలి. దొంగతనాల నివారణకు ఈవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోండి సోషల్ మీడియాలో వాట్సప్ స్టేటస్ లలో మేము ఊరికి వెళుతున్నాము అని సమాచారం పెట్టవద్దు. పగలు వేళలల్లో ఖాళీ సంచులు లేదా మరి ఏవైనా వస్తువులను విక్రయించే వారిపై నిఘా పెట్టాలి. రాత్రివేళ అనుమానంగా కాలనీలో సంచరించేవారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి. శివారు కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతికినట్లు కనిపిస్తే అప్రమత్తం కావాలి, పోలీస్ వారికీ సమాచారం ఇవ్వాలి. ఇరుగు పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిదని సూచించారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకుని వచ్చేలా చూసుకోవాలన్నారు. పక్కింటి వారిద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవటం మంచిదన్నారు. ఇంట్లోకుటుంబసభ్యులు బయటకు వెళ్ళినప్పుడు ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని, ఏమరుపాటుగా ఉండవద్దని హెచ్చరించారు. ఊరు వెళ్ళేటప్పుడు ఖరీదైన వస్తువులను ఇంట్లో పెట్టకపోవటమే మంచిదన్నారు. వాటిని బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిదన్నారు. కొత్తవారి కదలికలపై, అనుమానితులపై, సమాచారం పోలీస్ వారికి అందించి దొంగతనాల నివారణకు సహకరించాలి. మీ చుట్టుపక్కల వారి సెల్‌ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలని



సూచించారు. ఏదైనా సమాచారం ఇవ్వదలుచుకునేవారు పోలీస్‌స్టేషన్ ను సంప్రదించాలి. బయటకి వెళ్లే టప్పుడు తాళలను ఒకటికి రెండు సార్లు సరి చూసుకోండి. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను పోలీసు స్టేషన్ లో తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇళ్లపై నిఘా ఉంచుతాం. తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే పెట్రోలింగ్ కానిస్టేబుల్ ల నెంబర్ దగ్గర పెట్టుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులకి సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. ఊరికి వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు, మీకు దగ్గరగా పెట్టుకోవాలి. బ్యాగు, బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం. ఊరికి వెళ్లే హడావుడిలో ఇంట్లో విలువైన వస్తువులు మరిచిపోవద్దని పోయిన తర్వాత బాధపడే బదులు ముందే జాగ్రత్త చర్యలు తీసుకుంటే మంచిదని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని సిఐ గోపగాని గురువయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


# మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యూసుఫ్

**శామీర్‌పేట, సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :** తెలంగాణ శాసన మండలి సభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మూడుచింతలపల్లి మండల మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ ఆయనను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందజేశారు.



# మహేందర్ రెడ్డికి జైపాల్ రెడ్డి శుభాకాంక్షలు

**శామీర్ పేట సెప్టెంబర్ 23(ప్రజాస్వరం) :**
రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా బంజారాహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లిన రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జీ పట్నం సునీతా మహేందర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.



# దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

## జవహర్‌నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్




**జవహర్ నగర్, సెప్టెంబర్ 23,( ప్రజాస్వరం ) :**
దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ గీతాంజలి హై స్కూల్ ఆడిటోరియంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని టి పి టి ఎల్ ఎఫ్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ కర్నే సురేందర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశం అభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయి లోనే ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్ది అందుకు పునాది వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయ లేదన్నారు. జవహర్ నగర్ జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఆజముద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం పిల్లలు ప్రవేటు పాఠశాలలు చదువుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా దేశ అభివృద్ధిలో భాగస్వాములేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈపిటిఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఏ విజయకుమార్, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ గీతాంజలి హై స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ కృష్ణ , టిపిటిఎల్ఎఫ్ కాప్రా మండల నాయకులు నాగరాజు, ప్రవీణ్ , గులాపురం ఉపేందర్, మురళి , భవాని లిటిల్ రోజ్ హై స్కూల్ తదితరులు పాల్గొన్నారు.







# ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**శామీర్‌పేట, సెప్టెంబర్ 23(ప్రజాస్వరం):**
ఆలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్ గాడి మలక్ పేట గ్రామంలో మంగళవార ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థ దాట్ల ఫౌండేషన్ బయోలాజికల్ ఈ కంపెనీ వారి సహకారంతో ఎమ్మెస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ మౌలాలి వారి చే ఉచిత కంటి పరీక్షలు మరియు కంటి ఆపరేషన్ల ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ శిబిరంలో దాదాపు 100 మంది పాల్గొన్నారు. ఇందులో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించడం జరిగింది. లబ్ధిదారులకు కంటి అద్దాలు, రెటీనా సమస్యలు ఇతర కంటి వైద్యం అవసరమని గుర్తించడం జరిగింది. ఉచితంగా కంటి ఆపరేషన్ లను చేయడం జరుగుతుంది. కంటి అద్దాల అవసరమైన వారికి అందించడం జరుగుతుందని నిర్వాహకులు ప్రజలకు తెలియజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఎమ్మెస్ రెడ్డి లయన్ హాస్పిటల్ స్టాఫ్ నరేందర్, సుదర్శన్ పాల్గొన్నారు. దాట్ల ఫౌండేషన్ నుంచి కృష్ణ చైతన్య, ఇలాసాగర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థ నుంచి ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుటికుప్పల రవి, ఎలబోయిన సాంబరాజు, మచ్చ మధు, మామిడి శెట్టి మహేష్ మరియు డాక్టర్ ఒర్రె భవాని ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కిష్టయ్య, కాన్ రెడ్డి అరుణ, సుశీల, బండారు బిక్షపతి, మేకల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





# గాయత్రీ దేవిగా దుర్గామాత

**తూప్రాన్, సెప్టెంబర్ 23,ప్రజాస్వరం:**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా రెండో రోజు దుర్గా దేవి గాయత్రి దేవి రూపం లో భక్తులకు దర్శనమిచ్చారు.మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ కేంద్రం లోని దేవి గార్డెన్ లో ఏర్పాటు చేసినఅమ్మవ్రి విగ్రహం వద్ద మంగళవారం పాతఃకాల చతుఃషష్టి పూజ, చండీ హోమం ,కుంకుమార్చన వంటి పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదా కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం**

**శామీర్ పేట, సెప్టెంబర్ 23 (ప్రజాస్వరం) :**
శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేటకు చెందిన వంగ హన్మంత్ రెడ్డి శమంత దంపతులు, వంగ రాజశేఖర్ రెడ్డి, వంగ బాల్ రెడ్డి దివ్య దంపతులు, నాగి రెడ్డి సుధాకర్ రెడ్డి సౌమ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.











# ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ దుర్వినియోగంపై ఫిర్యాదు

**గజ్వేల్ , సెప్టెంబర్ 23 (ప్రజాస్వరం ) :**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వారి వ్యక్తిగత మీడియా సమావేశాలకు వాడుకోవడం చట్టరీత్య నేరమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. ఈ నెల 21 న ఆదివారం రోజున కొందరు ప్రైవేటు వ్యక్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని దుర్వినియోగానికి పాల్పడ్డారు వారికి ఎటువంటి ప్రభుత్వ బాధ్యతలు లేకున్నా వారి సొంత వ్యవహారాలకు మీడియా సమావేశాలు నిర్వహించుకోవడం చట్ట వ్యతిరేక చర్యగా భావిస్తూ గజ్వేల్ పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రైవేట్ వ్యక్తులు వాడటాన్ని ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిద్దిపేట జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, సిద్దిపేట జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకటరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్ మడుగురి నరసింహ ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బీజేపీ కార్యదర్శులు చిక్కుడు ప్రసాద్ పంజాల శివకుమార్ గౌడ్, బిజెపి నాయకులు నాగు ముదిరాజ్, మంద వెంకట్, కాళ్ల సాయికుమార్, బత్తిని నరేష్, శివలింగు బాలరాజ్, తుప్పతి నరేష్, చిక్కుడు సాయి, కోటే స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ముద్ద బతుకమ్మ వేడుకలు

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 23 ( ప్రజాస్వరం) :**



తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను మరచి పోతున్న నేటి కాలంలో వాటిని గుర్తు చేసుకుంటూ నేటి తరానికి అందించాల్సిన బాధ్యత,కర్తవ్యంగా భావిస్తూ ప్రాచీన సంప్రదాయం జానపద సాహిత్యాన్ని పరిరక్షించుకోవడం మన బాధ్యత.మంగళవారం రాయపోల్ మండలంలో మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రపంచంలో పూలను పూజించే సాంప్రదాయం ఎక్కడా లేదు. కేవలం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతుంది. ఏ దేవుడిని కలవాలన్న పువ్వులను ఉపయోగించి పూజలు చేస్తారు.కానీ పూలనే పూజిస్తూ తొమ్మిది రోజులు మహిళలు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించే సాంప్రదాయం తెలంగాణ రాష్ట్రంలోనే ఉంది. తెలంగాణ ఆడబిడ్డలు ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సంబరాలు గ్రామాలలో కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ప్రత్యేక పేరుతో బతుకమ్మను మహిళలు ఎంతో ప్రతిష్టాత్మకంగా బతుకమ్మను పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడవరోజు ముద్ద పప్పు బతుకమ్మ, నాలుగవ రోజు నాన్న బియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్న ముద్దుల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ వరకు బతుకమ్మ సంబరాలను కుటుంబ సభ్యులు, ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి పూలతోపాటు తీరొక్క పూవులతో బతుకమ్మ తయారుచేసి కోలాటాలతో బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా తీరొక్క పూవోలే తీసుకువచ్చి రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చి తయారు చేశారు. బతుకమ్మలను గౌరీ మాతగా పూజిస్తూ బతుకమ్మ ఆట పూర్తయిన తర్వాత మహిళలతో పాటు కుటుంబ సభ్యులు అందరూ కలిసి గ్రామాలలోని చెరువులో నిమజ్జనం చేస్తారు.

# పంట నమోదు తప్పనిసరి


- **మండలవ్యవసాయ అధికారి నరేష్**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 23 ప్రజాస్వరం :**

రైతులు వారు సాగుచేస్తున్న పంట వివరాలను . వ్యవసాయ అధికారుల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ప్రత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందరూ తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద పంటలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్తి పంటను ఈ నెల 25 తేదీలోపు పంట నమోదు చేసుకోవాలని, అదే విధంగా మొక్కజొన్న పంటను ఈ నెల 31 తేదీన లోపు పంటను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగిందన్నారు. అలాగే వరుసగా కురుస్తున్న వర్షాల వలన ప్రత్తి పంటలలో పండు ఆకులు వేసి ఎర్రబడే అవకాశం ఉంది. కనుక ప్రత్తి పంటను సాగు చేసే రైతులు 13.0.45 ఒక కేజీ ఎకరానికి + ఫార్ములా 4 ఒక కేజీ ఎకరానికి కలిపి పిచికారి చేసినట్లయితే పంట ఏపుగా పెరిగి పచ్చగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.



# ఆగమ్యగోచరంగా అండర్ బ్రిడ్జి పరిస్థితి



**మాసాయిపేట, సెప్టెంబర్ 24( ప్రజాస్వరం) :**

ప్రజలకు ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అండర్ బ్రిడ్జ్ ప్రాంగణం లో నిత్యం మోకాళ్ళ లోతు నీళ్లు నిలిచి ఉండటంతో ప్రజలు ప్రమాదపు అంచున ప్రయాణం చేస్తున్నారు. పిల్లా పాపలతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారికి అవస్థలు తప్పడం లేదు. కురుస్తున్న వర్షాల తో నీరు నిలువడం తో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకొని వర్షం నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణం

- **నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నాణ్యత ప్రమాణాలు, మిగిలి ఉన్న పనులపై పూర్తి చేయవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని అన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో అత్యాధునిక సాంకేతిక విద్య అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ముందుకు పోతున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ అనురాధ, డిఈ రాందాస్, ఎలక్ట్రికల్ డిఈ వాణి లత సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దుర్గాదేవి ఉత్సవాల్లో సినీ నటి జీవిత రాజశేఖర్



**మేడ్చల్ / గుండ్లపోచంపల్లి , సెప్టెంబర్ 23 (ప్రజాస్వరం ) :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గా దేవి ఉత్సవాల్లో బిజెపి నాయకురాలు, సినీ నటి జీవిత రాజశేఖర్ పాల్గొన్నారు. దేవి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గ దేవి మండపాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, మాజీ ఎంపీటీసీ ఉషిగారి శ్రీనివాస్, నాయకులు మలిగే అశోక్, బట్టికాడి విక్రమ్, సుంకు నవీన్, బండారి నరేష్,చింతలపూడి రామారావు, బట్టికాడి నవనీత, శాంతన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

**మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మెదక్ పట్టణంలోని నవాబు పేట్ లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారిని గాయత్రి మాత అవతారంలో అలంకరించి, వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు దుర్గామాత మాలదారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



# గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మంథని/ పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం):**

మంథని మండలం బెస్తపల్లి గ్రామంలోని ప్రముఖ ఆలయమైన గంగాదేవి ఆలయంలో నిత్యదీపారాధన కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారికి బెస్తపల్లి, దుబ్బపల్లి,చందనపూర్ గ్రామాల గంగపుత్రులు తమ కుల దైవమైన గంగాదేవికి మంగళవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.మేడి రవి స్వప్న దంపతులు అమ్మవారికి పది పట్టు వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తోకల మల్లేష్,మేడి లక్ష్మణ్,పూజారి అంజన్న పాల్గొన్నారు.



# నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల సందడి

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 23 ( ప్రజా స్వరం) :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని దుర్గ భవాని ఆలయంలో రెండో రోజు పూజాలో ముఖ్యర కీర్తన పెంటయ్యలు పాల్గొనడం జరిగింది అదే మాదిరిగా మండల వ్యాప్తంగా అమ్మవారి మండపాల వద్ద భక్తులు పూజలు ఘనంగా నిర్వహించారు నవరాత్రి ఉత్సవాల రెండవ రోజు ఆలయ ప్రాంగణం భక్తుల రాకపోకలతో సందడిగా మారింది. ఆద్యశక్తి అమ్మవారు మంగళవారం గాయత్రి దేవి రూపంలో అలంకరించబడి భక్తులకు మహాదర్శనం ఇచ్చారు. తెల్లని వర్ణంలో ఐదు ముఖాలతో సింహాసనం పై కూర్చున్న అమ్మవారు కరాల్లో జపమాల, కమండలువు, శంఖం, చక్రం, కమలం ధరించి దర్శనమిచ్చారు. ఈ దివ్యరూపాన్ని చూసిన భక్తులు ఆనందంతో మునిగిపోయి, అమ్మవారి కటాక్షం కోసం ప్రార్థనలు చేశారు. కొన్ని మండపాల వద్ద ప్రత్యేక పూజలు - హోమాలు ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య సాంప్రదాయబద్ధంగా జరిపిన అర్చనలతో ఆలయ వాతావరణం ఆధ్యాత్మిక కాంతితో మెరిసిపోయింది. గర్భగృహం చుట్టూ క్యూలలో నిలబడి భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని విద్య, జ్ఞానం, సంపద, శాంతి ప్రసాదించాలని ప్రార్థించారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ వేదికపై స్థానిక కళాకారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, భజన బృందాలు భక్తి గానాలు అందించడం భక్తులను ఆకట్టుకుంది. చిన్న పిల్లలు గాయత్రి మంత్ర పారాయణం చేయడం విశేష ఆకర్షణగా నిలిచింది.వెలుగుల కాంతుల్లో అమ్మవారి అలంకారం సాయంత్రం వెలుగుల మధ్య గాయత్రి దేవి రూపంలో అలంకరించబడిన అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను మరింతగా ఆకట్టుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు గాయత్రి దేవి రూప దర్శనం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

## టీఎస్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా గుండోజు ప్రవీణ్



**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్23(ప్రజా స్వరం):**
తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శిగా మంథని పట్టణానికి చెందిన స్వర్ణకార సంఘం నాయకుడు గుండోజు ప్రవీణ్ కుమార్ నియామకం అయ్యారు.ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.అనంతరం రాష్ట్ర కార్యదర్శి పెంద్యాల రామ్ కుమార్ తో కలిసి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ నియామక పత్రాన్ని గుండోజు ప్రవీణ్ కుమార్ కు అందజేశారు.తక్షణమే ఈ నియామకం అమలులోకి వస్తుందని జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు.మంథని డివిజన్ లో బీసీ కులాలన్నిటిని సంఘటితం చేసేందుకు పనిచేయాలన్నారు.ఈ సందర్భంగా గుండోజు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నన్ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కు,నా నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి పెంద్యాల రామ్ కుమార్ కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.బీసీల ఐక్యత కోసం,తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ముచ్చకుర్తి శ్రీనివాస్,దండే సదానందం లు పాల్గొన్నారు.ప్రవీణ్ నియామకం పట్ల స్వర్ణకార సంఘం నాయకులు వంగల తిరుమలేష్,మోదుంపురం విజయ్,సిరికొండ నాగన్న,కొమురోజు వేణు,సిరికొండ శ్రీనివాస్ లు హర్షం వ్యక్తం చేశారు.

## పిచ్చి మొక్కలు తొలగింపు

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్23(ప్రజా స్వరం):**



ఆడబిడ్డల పండుగ బతుకమ్మ పండుగ వేడుక కోసం మంథని బిఆర్ఎస్ నాయకులు పిల్లి సత్తయ్య పిచ్చి మొక్కలు తొలగించారు. మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని మున్సిపల్ పరిధి పోచమ్మ వాడలోని ప్రజల కోరిక మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిల్లి సత్తయ్య బతుకమ్మ,దసరా పండుగలు పురస్కరించుకొని తన సొంత ఖర్చులతో జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలు తొలగించారు.బతుకమ్మ వేడుక కార్యక్రమానికి స్థలం శుభ్రం చేయించారు.తన సొంత ఖర్చులతో సేవ చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగ బతుకమ్మ,బతుకమ్మ పండుగ ఆడబిడ్డలంతా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన తెలిపారు.స్థానిక ప్రజలందరికీ బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలను ముందస్తుగా తెలిపారు.

## రేడియం లైట్ జాకెట్లు, గ్రీన్ అండ్ రెడ్ లైట్ స్టిక్స్ అందజేత



**చేగుంట సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**
చేగుంట మండల కేంద్రంలో ఊర చెరువు జాతీయ రహదారి వద్ద రేడియం లైట్ జాకెట్లు మరియు గ్రీన్ అండ్ రెడ్ లైట్ స్టిక్స్ ను ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డికి గ్రామ ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి అందజేశారు. చేగుంట మండల కేంద్రంలో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సాయంత్రం వేళ జాతీయ రహదారి 44 పై నుండి దాటుకుంటూ ఊర చెరువులోకి వెళ్లి బతకమ్మలను చెరువులో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. బతుకమ్మలతోవారు రోడ్డు దాటేందుకు రోడ్డుపై వాహనాలు నిలుపుదల కోసం ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి పోలీస్ సిబ్బందికి మరియు గ్రామ పంచాయతీ సిబ్బందికి, మస్కూరి వారికి లైట్ రేడియం జాకెట్లు,గ్రీన్ లైట్ రెడ్ లైట్ స్టిక్స్ అందజేశారు.

## మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**మేడ్చల్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**
మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు మీద ఉన్న కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం ఐఎన్టీయూసీ మేడ్చల్ ఆటో యూనియన్ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు ఎర్ర విజయ్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా తమ ఆటోలకి అమ్మవారి ఆలయం దగ్గర పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారి కృపా కటక్షలతో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు గణేష్, ఓం రాజ్, నర్సింగ్, కిషోర్, కుమార్, సురేష్ ముదిరాజ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు



## ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు పటిష్ట కార్యాచరణ

- **పెద్దపల్లి అదనపు కలెక్టర్ డి.వేణు.**
- **దశల వారీగా వరి కోతలు జరిగేలా చర్యలు**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు ట్యాగ్ చేయాలి**
- **ధాన్యం కొనుగోలు అంశంలో వ్యవసాయ శాఖ పోషించాల్సిన పాత్రపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం):**
వానాకాలం 2025 సీజన్ ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు వ్యవసాయ శాఖ పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవార అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు అంశంలో వ్యవసాయ శాఖ పోషించాల్సిన పాత్ర పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2025 సీజన్ పంట కొనుగోలు సమయంలో సన్న రకం ధాన్యానికి కనీసం మద్దతు ధరకు అదనంగా 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యతకు సంబంధించి ఏమైనా వివాదాలు తలెత్తితే వ్యవసాయ విస్తరణ అధికారులు పరిష్కరించాలని,అదే సమయంలో సన్న రకం ధాన్యం నాణ్యత ను మండల వ్యవసాయ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీని తగ్గించుటకు గాని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు ఇస్తూ ఒకే సమయంలో కాకుండా దశలవారీగా వరి కోతలు చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ వరి కోతలు క్రమ పద్ధతిన జరిగేలా చూడాలని,కోతల సమయంలో హార్వెస్టర్లు 18 కంటే ఎక్కువ ఆర్.పి.ఎం నడిచేలా చూడాలని తద్వారా కోతల సమయంలోనే తాలూ చేత వంటి పదార్థాలు ధాన్యం నుండి వేరే చేయవచ్చని అన్నారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారికి ట్యాగ్ చేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ తగ్గించేందుకు రైతుకు టోకెన్లు ఇచ్చి క్రమ పద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా చూడాలని,రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఎండబెట్టి టోకెన్ల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని అన్నారు. కౌలు రైతులు పేద రైతులు చిన్నచిన్న కమతాలను సాగు చేస్తున్న రైతులు,ప్రభుత్వ భూములలో అటవీ భూములలో పంటలు పండించే చిన్న కారు రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వ లేరని,వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ అంశాన్ని పరిశీలించి తగు ధ్రువీకరణ పత్రంతో 50 క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు చేపట్టవచ్చని,50 క్వింటాళ్ళకు మించి నట్లయితే సంబంధిత మండల వ్యవసాయ అధికారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,మండల వ్యవసాయ శాఖ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## వసతి గృహంలో ఫుడ్ పాయిజన్.. 10మంది విద్యార్థులకు అస్వస్థత

- **కలుషిత ఆహారం సంఘటనపై కమిటీ ఏర్పాటు : కలెక్టర్ రాహుల్ రాజ్**

**చేగుంట సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**



చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ గల ఓ వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కావడంతో పదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించి వైద్య సేవలు అందించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ చేగుంట మండలం ఇబ్రహీంపూర్ ఓ ప్రైవేట్ వసతి గృహంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించి పిల్లలు 25 మంది వసతి పొందుతున్నారని సోమవారం రాత్రి వారు తీసుకున్న భోజనంలో నాణ్యత లోపించి 10 మంది వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురి కావడం జరిగిందని పదిమంది తీవ్ర అస్వస్థతను దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్ లో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించడం జరిగిందన్నారు . తక్షణ సహాయ చర్యలపై వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు వైద్య సేవలు అందించాలని రామాయంపేట వైద్యాధికారులకు అధికారులకు సూచించడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. కలుషిత ఆహారం సంఘటనపై పూర్వపరాలు తెలుసుకోవడానికి మెడికల్ బృందాన్ని కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలు, హోటల్స్ , రెస్టారెంట్లను ఆహారం పరిశుభ్రతలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఆరోగ్యంగా ఉండటానికి వంటగదిని, ఆహారాన్ని శుభ్రంగా ఉంచుకోవడం. ఆహారాన్ని వండే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పాత్రలను శుభ్రంగా ఉంచడం, తాజా పదార్థాలను వాడటం, వండిన ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం వంటివి పరిశుభ్రమైన వంటలో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తాసిల్దార్ రజని, డాక్టర్ శివ దయాల్, వైద్యాధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## రఘురాములుకు ఘన సన్మానం

**చేగుంట సెప్టెంబర్ 23, (ప్రజా స్వరం) :**
చేగుంట సహకార సంఘం అధ్యక్షులు గా బాధ్యతలు చేపట్టిన అయిత రఘురాములు ను మండల బంజారా సంఘం నాయకులు సన్మానించారు. మంగళవారం రోజున చేగుంటలో చైర్మన్ రఘు రాములు కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బిక్యా నాయక్, సుభాష్ నాయక్, రాంజీ, బన్సీ, రాములు, లింబియా, లచ్చ వెంకటి, గన్యా నరేష్, వసురం,సిద్ధూ, బాలు,గనియా, వరుజ,గణేష్ తదితరులు పాల్గొన్నారు



## చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**
హరితహారం చెట్లును నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మందాపురం నరేష్ మంగళవారం పురపాలక కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందాపురం నరేష్ మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కొట్టేసి డబ్బులకు అమ్ముకున్నట్లు ఆరోపించారు. గతంలో ఈ చెట్లను హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటినట్లు గుర్తు చేశారు. పురపాలక, అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ స్థలాలలో నాటిన చెట్లను ఏ విధంగా కొట్టేసి అమ్ముకుంటారని ప్రశ్నించారు. అక్రమంగా హరితహారం చెట్లను నరికివేసి అమ్ముకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పురపాలక కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా చెట్లు నరికేసిన వ్యక్తుల పైన వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ (ఎం) పార్టీ మండల నాయకులు రమేష్, పూజ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల లాభాల వాటలో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం

- **ఎమ్మెల్సీ , జాగ్రతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ**

**గోదావరిఖని/పెద్దపల్లి,సెప్టెంబర్23(ప్రజా స్వరం):**
సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీలో యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తుందని ఎమ్మెల్సీ , జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి వచ్చిన ఆమె రామగుండం కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జాగృతి నేతలతో పాటు హెచ్ఎంఎస్ కార్మిక నాయకులను ఆమె కలిశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్మికులకు లాభాల వాటా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తూ వారి నోట్లో మట్టిని కొడుతుందన్నారు. దేశానికి వెలుగులు విరజిమ్మే సింగరేణి కార్మికుల కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. లాభాల వాటా పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఆర్భాటంగా చెబుతున్నప్పటికీ వారికి దక్కేది ఏం లేదని ఆరోపించారు.లాభాల వాటా కార్మికుల హక్కు అని వాళ్లకేమీ బిక్షం వేయడం లేదని పేర్కొన్నారు.ఆమె వెంట జాగృతి నాయకులు హెచ్ఎంఎస్ నాయకులు ఉన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 23 ప్రజాస్వరం**
మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతూ మంగలి దశరథం చెందిన విషయం తెలుసుకొని ఆపేక ట్రస్ట్ సభ్యులు 20 వేల రూపాయలు నగదును ఇవ్వడం జరిగింది. అనంతరం ట్రస్ట్ సభ్యులు వేరు వేరుగా మాట్లాడుతూ స్థానికంగా జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునే క్రమంలో ఆపే గా ట్రస్ట్ ముందుకు వచ్చిందన్నారు .బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి, వారిని ధైర్యం చెప్పింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలతో ఐక్యతగా నిలబడటం సమాజం యొక్క కర్తవ్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన చోట సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ బాధ్యులు హామీ ఇచ్చారు.

## లేబర్ స్కీములను ప్రైవేటు సంస్థలకు ఇవ్వద్దు

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్23(ప్రజా స్వరం):**
లేబర్ స్కీములను ప్రైవేటు సంస్థలకు ఇవ్వద్దని సీఐటీయూ ఆధ్వర్యంలో మంథని సహాయ కార్మిక అధికారి రవీందర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ప్రమాద మరణానికి 10 లక్షలు,సహజ మరణానికి రెండు లక్షలు పెంచుతూ నిర్ణయం చేసిందన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా చేసిన పోరాట ఫలితంగానే బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని దీన్ని స్వాగతిస్తున్నామన్నారు.కానీ స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని జీవో నెంబర్ 12 తీసుకువచ్చి 346 కోట్ల రూపాయలను ప్రైవేటు సంస్థలకు అక్రమంగా అప్పజెప్పడం అన్యాయమని అన్నారు. జీవో నెంబర్ 12 ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికుల ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆయుర్వేద వైద్య సేవలు వినియోగించుకోవాలి

- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ ( ప్రజా స్వరం ) :**
కరీంనగర్ జిల్లా రామ్ నగర్ లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఆయుర్వేద వైద్య సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు.

## పాఠశాలకు అదనపు టీచర్ ను కేటాయించాలని ఎంఈఓకు వినతిపత్రం

**మేడ్చల్, సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**
అక్బర్జాపేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు అదనపు టీచర్ ను కేటాయించాలని కోరుతూ డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్షుడు రాము మంగళవారం మండల విద్యాశాఖ అధికారి శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అక్బర్జాపేట్ ప్రాథమిక పాఠశాలలో చాలా సంవత్సరాలుగా సింగిల్ టీచర్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే టీచర్ ఉండటం వల్ల 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉన్న అన్ని తరగతుల పాఠాలు హెడ్ మాస్టర్ బాధ్యతలు చేపడుతున్నారన్నారు. దీంతో విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. సదరు టీచర్ ప్రభుత్వ అధికారిక మీటింగులు ఉన్నప్పుడు పాఠశాల మూతపడుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అదనంగా మరి ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. తక్షణమే విద్యావాలంటరీనైనా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కోటగిరి నర్సింగరావు, వీరేష్, నర్సింహ చారి తదితరులు పాల్గొన్నారు.



## వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు

**చేగుంట సెప్టెంబర్ 23 (ప్రజా స్వరం) :**
వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందని ప్రభుత్వం మోడల్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వేర్ ఉపాధ్యాయులు కే. మధు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. పది రోజులపాటు ఈ కార్యక్రమాన్ని విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగానే ప్రణయ్ నెట్ సెంటర్ బేసిక్స్ సిస్టమ్ వర్క్ ఎమ్ ఎస్ ఆఫీస్ ఎడిటింగ్, ప్రింటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ మోడల్ కళాశాల చెందిన 17 మంది ఒకేషనల్ విద్యార్థినులకు ఈ అవగాహన క్షేత్రస్థాయిలో కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ అవగాహన వారు ఉపాధి అవకాశాల కోసం సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు దొరకనప్పుడు స్వయం ఉపాధి కోసం ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
**EDITOR : PURAM MAHESHWAR.** RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999